
సాక్షి
ములుగు
శనివారం | 12 | అక్టోబర్ | 2024


రామాలయంలో మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు



మంగపేటలోని ఉమాచంద్రశేఖరస్వామి ఆలయంలో.., గోవిందరావుపేటలో..

మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు

జిల్లాలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో దుర్గామాతను మహిషాసురమర్దినిగా అలంకరించారు. అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారికి వేపాకు, నిమ్మకాయల మాలను అలంకరించి పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరీ ఆలయ స్థలంలో స్టార్ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు రాధాకృష్ణశర్మ నిర్వహించారు. సాయిబాబా ఆలయం, ముత్యాలమ్మ గుడి, శివాలయం, క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో కూడా అమ్మవారికి పూజలు నిర్వహించారు.

- ఏటూరునాగారం

న్యూస్‌రీల్

అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల వేతనాలు పెంపు

హన్మకొండ: విద్యుత్ అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల వేతనాల పెంపునకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అంగీకరించినట్లు ఐఎన్‌టీయూసీ తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డికి వినతిపత్రం అందించామని పేర్కొన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తమ యూనియన్ వినతి పత్రానికి స్పందించిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ స్కిల్డ్ వర్కర్లకు స్కిల్డ్ వేతనం రూ.17,598 ఇచ్చేందుకు అంగీకరించిందని పేర్కొన్నారు.

యాగ పూర్ణాహుతి



హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు గురువారం ఉత్సవాల యాగ పూర్ణాహుతి నిర్వహించారు. అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారి మూలమూర్తికి ఉదయం పూర్ణాభిషేకం, చతుస్థానార్చలు నిర్వహించారు.

కాళేశ్వరంలో..

కాళేశ్వరం: శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం అనుబంధ దేవాలయాల్లోని శ్రీశుభానందదేవి, శ్రీమహాసరస్వతీ అమ్మవార్లు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణలో దర్శనమిస్తున్నారు. శుక్రవారం ఆలయ యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, పనకంటి ఫణీంద్రశర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజశ్యామాలర్చన, లలిత సహస్రనామార్చన, మూలమంత్ర చండీహోమం, పూర్ణాహుతి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, వసంత పాల్గొన్నారు.

సింగరేణిని లాభాల్లోకి తీసుకెళ్లాలి



భూపాలపల్లి అర్బన్: కార్మికులు మరింత శ్రమించి సింగరేణి సంస్థను ముందుకు తీసుకెళ్లాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర కార్యక్రమం నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సందేశాలను కార్మికులకు వినిపించారు. అనంతరం ఏరియాలో సింగరేణి అధికారులు కార్మికులకు నిర్వహించిన సహపంక్తి భోజనాల కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని కార్మికులతో కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన లాభాల్లో నుంచి కార్మికులకు 33శాతం వాటా ఇచ్చినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో కూడా బొగ్గు ఉత్పత్తిని కార్మికులు మరింత పెంచి సంస్థను లాభాల్లోకి తీసుకువెళ్లే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సింగరేణి ఏరియా ఆస్పత్రుల్లో సీటీ స్కానింగ్ మిషన్లు ఏర్పాటు చేశామన్నారు. సీఎస్ఆర్ నిధులతో ఎంఆర్ఐ మిషన్లు ఏర్పాటు చేయాలని, ఆస్పత్రిల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలని, స్పెషలిస్టు డాక్టర్లను నియమించాలని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్, ఎస్‌వోటు జీఎం కవీంద్ర, కార్మిక సంఘాల నాయకులు బుచ్చయ్య, రమేష్, అధికారులు, కార్మికులు మారుతి, అశోక్, దేవస్, కొమురయ్య, కిషన్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రావణవధకు ఆహ్వానం


సీతక్కకు ఆహ్వాన పత్రం అందిస్తున్న సభ్యులు

ములుగు: విజయదశమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సాధన హైస్కూల్ పక్కన నిర్వహించనున్న రావణవధకు రావాలని కోరుతూ ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క, జడ్జి కన్నయ్యలాల్‌కు వేర్వేరుగా ఆహ్వానం అందించారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గండ్రకోట కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దుబాసి రమేష్ (బాంబేక్లాత్ స్టోర్స్), న్యాయవాది చెలుమల్ల రాజేందర్, రాసమల్ల శివాజీ, కన్వీనర్ పొద్య కుమార్, ప్రధాన కార్యదర్శి గండె రాజు, సురేందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


దసరాకు సర్వం సిద్ధం

నేడు విజయదశమి పర్వదినం ● శమీపూజ, రావణవధకు ఏర్పాట్లు పూర్తి


ములుగులో రావణవధకు ఏర్పాట్లు చేస్తున్న కమిటీ సభ్యులు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

ఏటూరునాగారం: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పర్వదినం జరుపుకుంటారు. సద్దుల పండుగ సంబురంగా జరుపుకున్న తర్వాత.. చేసే ప్రతీపనిలో విజయం సాధించాలని అమ్మవారిని వేడుకుంటూ.. జరుపుకునేదే దసరా. జిల్లా ప్రజలు విజయదశమి వేడులను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. నేడు (శనివారం) విజయదశమి సందర్భంగా జిల్లాలోని మండలాలు, గ్రామాల్లోని దేవాలయాలు, ముఖ్య కూడళ్ల వద్ద శమీ పూజ, రావణవధకు ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామంలోని గ్రామ దేవత వద్ద గుమ్మడికాయలను కొట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. భవానీ మాలధారులు, ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు కలిసి శమీచెట్టు కొమ్మను ఊరేగింపుగా రావణవధ స్థలానికి చేరుకుని ఒకరినొకరు జమ్మి ఆకు ఇచ్చిపుచ్చుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. చేపట్టబోయే పనులు విజయాలు సాధించాలని కోరుకుంటారు. జిల్లా కేంద్రంతో పాటు ఏటూరునాగారంలో ఓడవాడ ప్రాంతంలో ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో రావణవధకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసులు పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వ్యాపారస్తులు షాపుల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు.



రాజరాజేశ్వరీగా అమ్మవారు..

విజయదశమి రోజున దుర్గాదేవి అమ్మవారు రాజరాజేశ్వరీగా శాంతిమూర్తి అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. దీంతో నవరాత్రి ఉత్సవాలు ముగిసిపోనున్నాయి. విజయదశమి మరుసటి రోజు అమ్మవారి నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు


వాజేడు: సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

● ఎస్పీ డాక్టర్ శబరీష్
● వాజేడు పోలీస్ స్టేషన్ తనిఖీ

వాజేడు: విధుల్లో ఎవరూ నిర్లక్ష్యం వహించొద్దని ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా వాజేడు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి కేసుల వివరాలను సీఐ బండారి కుమార్, ఎస్సై రుద్రారపు హరీష్‌లను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించిన వెంటనే రశీదును ఇవ్వాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదును నిష్పక్షపాతంగా చేయాలని, ఈ ప్రాంతంలో ఆదివాసీ ప్రజలు ఎక్కువగా ఉన్నందున వారికి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ప్రజల భద్రతే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. ఆయన వెంట వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, ఎస్సై రుద్రారపు హరీష్, సిబ్బంది ఉన్నారు.

ఆయుధపూజ చేస్తున్న ఎస్పీ డాక్టర్ శబరీష్



హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ పూజ

ములుగు: దసరా పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆయుధాలకు పూజలు చేశారు. ఆయన వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందం, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఆర్ఐ అడ్మిన్ వెంకట్‌నారాయణ, ఆర్ఐ ఎంటీఓ సంతోష్, ఆర్ఐ హోంగార్డ్స్, వెల్ఫేర్ తిరుపతి, ఆర్.ఎస్సైలు గోపీచంద్, అశోక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘ఏజెన్సీ’ విద్యా కుసుమాలు

● పట్టుదలతో చదివి టీచర్ ఉద్యోగాలు సాధించిన పలువురు

ఎస్ఎస్‌తాడ్వాయి: డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో 178 మంది ఉపాధ్యాయ కొలువులు సాధించారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన పలువురు కష్టపడి చదువుకుని టీచర్ ఉద్యోగం సాధించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని పట్టుదలతో చదువుకుంటే విజయం సాధించవచ్చని నిరూపించారు. టీచర్ ఉద్యోగాలు సాధించడంతో వారి వారి కుటుంబాల్లో ఎనలేని ఆనందాన్ని నింపింది. పాఠశాలల్లోని విద్యార్థులను కూడా ప్రభుత్వ కొలువులు సాధించేలా, సమాజంలో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పలువురు సాక్షికి తెలిపారు. కొలువులు సాధించిన వారి మనోగతం తెలుసుకుందాం.

176 మంది టీచర్ల రిపోర్టు

ములుగు: డీఎస్సీ నియామక పత్రాలు అందుకున్న 176 మంది టీచర్లు శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ పాణినికి రిపోర్ట్ చేశారు. మొత్తం 192 ఖాళీలకు 178 మంది ఎంపిక కాగా, ఒకరు జేఎల్‌పోస్టుకు, మరొకరు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడంతో రిపోర్ట్ చేయలేకపోయారు.

ఉపాధ్యాయ కొలువు సాధించాలని..



ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని చిన్న నాటి నుంచి ఉండేది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో టీటీసీ, బీఈడీ పూర్తి చేశాను. టెట్‌లో కూడా 105 ర్యాంకు వచ్చింది. పట్టుదలతో చదివాను. ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. విద్యార్థులకు పాఠాలు బోధించి వారిని ఉన్నతస్థానంలో నిపాలన్నదే లక్ష్యం. - గద్దం ప్రవళిక, వెంకటాపురం(కె)

పేదరికం అడ్డుకాదు..



లక్ష్యంతో చదువుకుని ప్రభుత్వ కొలువు సాధించా. తన తండ్రి రామాదాసు ప్రభుత్వం పాఠశాలలో ఔట్ సోర్సింగ్‌లో స్వీపర్‌గా పని చేస్తూ చదివించారు. తండ్రి కష్టానికి ఫలితంగా ఉద్యోగం సాధించాలని, చదువుకు పేదరికం అడ్డు కాదనే పట్టుదలతో చదవి ఉద్యోగం సాధించాను. తన తండ్రి కష్టానికి ఫలితంగా ఉద్యోగం సాధించాను.

- దాసరి అనూష, గోవిందరావుపేట

చిరకాల కోరిక నెరవేరింది..



ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావాలనే చిరకాల కోరిక నెరవేరింది. క్రమశిక్షణతో చదువుకుని డీఈడీ, పీజీ పూర్తి చేశాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో డీఎస్సీ పరీక్ష రాసి తెలుగు పండిట్‌గా ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. పాఠశాలల్లోని విద్యార్థులను క్రమశిక్షణతో ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తా.

- కావిరి రాజబాబు, బుట్టాయిగూడెం

తాపీ మేస్త్రీ నుంచి టీచర్ వరకు..



దళిత సామాజిక వర్గానికి చెందిన తమది పేదరిక కుటుంబం. కష్టపడి టీటీసీ చదువుకున్నాను. టీచర్ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో కూలీ పనులకు వెళ్తూ ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకున్న. గతంలో డీఎస్సీ రాస్తే అర్హత సాధించలేదు. దీంతో వెనకడుగు వేయకుండా డబ్బుల కోసం తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో డీఎస్సీ ప్రిపేర్ అయ్యాను. ఈసారి డీఎస్సీ రాస్తే 13వ ర్యాంకు వచ్చింది. నా కష్టానికి ఫలితం దక్కింది. అలాగే తన భార్య శివకుమారి కూడా ఓపెన్ కేటగిరీలో ఎస్జీటీగా ఎంపికైంది.

- వావిలాల దుర్గాప్రసాద్,శివకుమారి దంపతులు, తాడ్వాయి

పట్టుదలతో చదివాను..



కష్టపడి పట్టుదలతో చదువుకున్న. మా నాన్న చిన్నప్పుడే మరణించారు. తల్లి అంకుల అన్ని రకాలుగా ఆదుకుంది. డీఎస్సీలో 22 ర్యాంకు రాగా ఎస్జీటీగా ఉద్యోగం వచ్చింది. మొదటి ప్రయత్నంలోనే 70 మార్కులు సాధించి మంచి మెరిట్ సాధించా.

- దుర్గం సౌజన్య, రొయ్యూరు

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

● మంత్రి ధనసరి సీతక్క
● యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన


ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్, తదితరులు

ములుగు రూరల్: రాష్ట్రంలో భావితరాలకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం మండలంలోని ఇంచర్ల శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రాతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ అన్ని వర్గాల విద్యార్థులు ఒకే గురుకులంలో విద్యను అభ్యసించే విధంగా సకల వసతులతో రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను నిర్మించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. మొదటి విడతలోనే ములుగు నియోజకవర్గం ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్పొరేట్‌కు దీటుగా యూనివర్సిటీ స్థాయిలో రూ. 125 కోట్లతో గురుకుల పాఠశాలను నిర్మిస్తున్నామన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు దోహదపడతాయని, 4 నుంచి 12వ తరగతి వరకు బోధన తరగతులు నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వం పదేండ్ల కాలంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని చెప్పడమే తప్ప సొంత భవనాలు నిర్మించడంలో విఫలమయ్యారన్నారు. జిల్లాలో మెడికల్ కళాశాలను ఈ నెల 15 లేదా 16 తేదీలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ప్రారంభిస్తారన్నారు. అలాగే ఐటీ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు ఐటీడీఏ పీఓ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా ల్యాప్‌ట్యాప్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగేందర్‌రావు, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఆర్ అండ్ బీ ఏఈ రాకేష్, జిల్లా బీసీ సంక్షేమాధికారి రవీందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పేదల పక్షాన నిలబడతాం

ములుగు: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడే ప్రభుత్వమని మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. దసరా పండుగ సందర్భంగా నిరుపేదలకు అండగా ఉండాలని షెల్ ఇన్ఫోటెక్ సౌజన్యంతో కలెక్టర్ దివాకరతో కలిసి 20 రకాల సరుకులను శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 100 మందికి స్పెషల్ రేషన్ కిట్స్ అందించారు. ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ రహీం తదితరులు పాల్గొన్నారు.

14న ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 14న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్ –19 బాలుర రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ జనన ధ్రువీకరణ, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 15వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పీఈటీ తోట శ్యాంప్రసాద్‌ను 98492 10746 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

బతుకమ్మ నిమజ్జనంలో తేనెటీగల దాడి


చిన్నారులను ఎత్తుకుని పరుగులు తీస్తున్న గ్రామస్తులు, యువతులు

మంగపేట: మండలంలోని కొత్తూరుమొట్లగూడెంలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వెళ్లిన వారిపై తేనెటీగలు దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కొత్తూరుమొట్లగూడెం గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ సంబురాలు గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు కొనసాగాయి. ఈ తరుణంలో కొద్దిపాటి వర్షం చినుకులు రావడంతో అప్పటి వరకు ఎంతో సంతోషంతో ఆడిపాడిన మహిళలు ఇళ్లలోకి వెళ్లారు. కొద్ది సేపటి తర్వాత వర్షం పూర్తిగా తగ్గి పోవడంతో పాటు అప్పుడే తెల్లవారుతుండగా గ్రామస్తులు, మహిళలు బతుకమ్మలను గ్రామ సమీపంలోని గౌరారం వాగులో నిమజ్జనం చేసేందుకు వెళ్లారు. బతుకమ్మలను వాగులో వదిలేందుకు అందరూ ఒకేచోటకు చేరడంతో బతుకమ్మలపై ఏర్పాటు చేసిన అగర్‌బత్తీల పొగతో చెట్టుపై ఉన్న తేనెటీగలు లేచి వారిపై దాడి చేశాయి. ఒక్కసారిగా తేనెటీగలు కుట్టడంతో బతుకమ్మలను వాగులో వదిలేసి గ్రామంలోకి పరుగులు తీశారు. అప్పటికే సుమారు 10 మందికి పైగా తేనెటీగల దాడిలో గాయపడ్డారు.

విజయదశమి శుభాకాంక్షలు



అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

విద్యారణ్యపురి: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో తాను లేవనెత్తానని, మరోసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికల బరిలో ఉండబోతున్నానని ఇప్పటివరకు పరిష్కారం కాని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతల కల్పనకు కృషిచేసినట్లు చెప్పారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో టైంటేబుల్ మార్పు, కేర్‌టేకర్ల నియామకం, కేజీబీవీ సిబ్బంది రెగ్యులరైజేషన్, కనీస వేతనాలు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల పదోన్నతులు, ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టుల మంజూరి కోసం కృషి చేస్తానన్నారు. తాను ఏపార్టీకి కూడా తొత్తుగా వ్యవహరించబోనని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించబోయే వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా పోటీచేయబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి, టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి సో మశేఖర్, రంజిత్‌కుమార్, మల్లారెడ్డి, పెండెం రాజు, కుమార్, కిరణ్‌కుమార్, సుజన్ ప్రసాద్‌రావు, మురళీకృష్ణ, చంద్రశేఖర్‌రావు, వాసుదేవరెడ్డి, దామోదర్, మల్లిక్ పాల్గొన్నారు.

నర్సిరెడ్డికి వివిధసంఘాల మద్దతు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసన మండలికి ఉపాధ్యాయ, అధ్యాపకసంఘాల మద్దతుతో టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి తిరిగి పోటీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి వెల్లడించారు. శుక్రవారం హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో వివిధ సంఘాల బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ నర్సిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలియజేశారు. సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వస్కుల శ్రీనివాస్, కొప్పిశెట్టి, సురేశ్, తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ బాధ్యులు ఆస్నాల శ్రీనివాస్, కొండయ్య, మహేశ్, సంజీవయ్య, విజయ్‌మోహన్, హరగోపాల్, రాజిరెడ్డి, రవీందర్, సుధాకర్, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి




హుస్సేన్ మృతదేహం

ఖిలా వరంగల్: పడమరకోట ఎస్సీ వాడకు చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ శివనగర్‌లోని భూపేష్‌నగర్ చెందిన ఎండీ హుస్సేన్(32) ఖిలా వరంగల్ పడమరకోటకు చెందిన మంద సంధ్యారాణిని 12 ఏళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకుని.. భవన నిర్మాణ కార్మికుడిగా సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు సద్దుల బతుకమ్మ ఆడుకునేందుకు వెళ్లగా హుస్సేన్ తన స్నేహితుడైన పడమరకోట పద్మశాలి వీధికి చెందిన గూడూరు శివ వద్దకు వెళ్లాడు. రాత్రి 10గంటల సమయాన హుస్సేన్ సొమ్మసిల్లిపడిపోయి ఉన్నాడని గూడూరు శివ హుస్సేన్ భార్యకు సమాచారం ఇచ్చాడు. సంధ్యారాణి, శివ కలిసి అతడి ఆటోలోనే హుస్సేన్‌ను ఇంటికి తీసుకొస్తారు. కానీ అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్నేహితుడిపై అనుమానం ఉందని మృతుడి భార్య, బంధువులు ఆరోపించారు. మృతుడి భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.









16 నుంచి మణుగూరు బెల్గావి రైలు ప్రారంభం



డోర్నకల్: బెల్గావి మణుగూరు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 16 నుంచి పునఃప్రారంభం కానుంది. పండుగ సమయాల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సుమారు నాలుగు నెలల క్రితం రద్దయిన ఈ ఎక్స్‌ప్రెస్‌ను 16వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు నడపనున్నారు. వారానికి నాలుగు రోజులు నడిచే ఈ రైలు బెల్గావి నుంచి మణుగూరుకు(07335) ఆది, సోమ, బుధ, గురువారాల్లో, మణుగూరు నుంచి బెల్గావి(07336) ఆది, బుధ, గురు, శనివారాల్లో నడవనుంది. బెల్గావి రైలు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ తాము ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన జీఎం అరుణ్‌కుమార్‌ను కలిసి రైలును పునరుద్ధరించేందుకు కృషి చేశారని డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు మైనుపాషా తెలిపారు.









క్రీడాకారిణికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పలిమెల : అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన మండల కేంద్రానికి కావేరి జ్యోతికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా రూ.1.19 లక్షల చెక్కును కావేరి జ్యోతికి అందజేశారు. ఈ నెల 4వ తేదీన సాక్షిలో ప్రచురితమైన 'కాలు కోల్పోయినా.. కఠోర సాధనతో ముందుకు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందనగా రాష్ట్ర ప్రభుత్వం కావేరి జ్యోతికి ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఈ సందర్భంగా కావేరి జ్యోతి, తల్లిదండ్రులు కావేరి బుచ్చయ్య– లక్ష్మి దంపతులు మంత్రి శ్రీధర్‌బాబు, సాక్షి దినపత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్ రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. గోశాల ప్రక్కన. సంప్ర: 9848696291 [W-1237317]

PLOT FOR SALE

■ యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంకు లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రీసార్ట్స్, స్విమ్మింగ్ పూల్, పార్క్, అన్ని వసతులతో. Ph: 8106340199 [HA-14723]

SERVICES

CHANGE OF NAME

■ I, CHARISHMA, D/o. MOHAMMED ANKOOS AHMED (Old Name), R/o. H.No. 2-7-115, Bhavani Nagar, NGO's Colony, Hanumakonda District, Telangana State 506001, India. I have changed my name as MD. CHARISHMA, D/o. Mohammed Ankoos Ahmed (New Name) for all future purposes. [W-1237322]

గొర్రె / గొర్రె పోతులు అమ్మకం

■ దేశవాలి గొర్రెపోతులు & గొర్రెలు కాపరిచే పెంచబడినవి అమ్మకమునకు కలవు. గొర్రె పోతు లైవ్ 1కెజి. 460/-, గొర్రె (ఆడది) లైవ్ 1కెజి 400/- ఒగ్లాపూర్, దామెర మం॥ సంప్ర. 9030241156, 9121604262 [M-12175]

WANTED

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663. [H-796283]

■ Wanted Civil Engineer's Male Only + Marketing Executives for Sai Manikanta Reddy Mix Concrete Diploma/B.Tech, Civil with 2 years Experience Drop your Resume on Whatsapp No's 7670956668, 7330871166, 8555890439, 9849277408. [WA-14711]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన
రూ॥ 260/-
అదనపు లైను
రూ॥ 60/- మాత్రమే
5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేడు గార్లలో జాతీయజెండా ఆవిష్కరణ

● దసరా రోజున జెండా ఆవిష్కరణ ఇక్కడ ప్రత్యేకత
● నైజాం కాలం నుంచి కొనసాగుతున్న ఆనవాయితీ

గార్ల: జాతీయతా భావాన్ని, దేశభక్తిని మననం చేసుకుంటూ అందుకు చిహ్నంగా దసరా పండుగ రోజు మానుకోట జిల్లా గార్ల మండల కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించడం ఆనవాయితీగా వస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిన అనంతరం గార్ల మున్సిపాలిటీకి చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ నేత మాటేడి కిషన్‌రావు దసరా పండుగ రోజు కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. దీంతో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్య ఘర్షణలు జరిగాయి. గార్ల మున్సిపాలిటీ కమ్యూనిస్టు పార్టీ కౌన్సిలర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు దేశభక్తికి చిహ్నంగా పార్టీలకు అతీతంగా దసరా రోజు జాతీయ జెండాను ఎగురవెయ్యాలని తీర్పు ఇచ్చింది. దీంతో 1958లో నాటి మున్సిపల్ చైర్మన్ మాటేడి కిషన్‌రావు జాతీయజెండాను ఎగురవేశారు. నాటినుంచి దసరా రోజు జాతీయజెండాను గార్ల వీధుల్లో మేళతాళాలతో పంచాయతీ పాలకవర్గం, స్థానిక ప్రముఖులతో కలిసి ఊరేగించి మసీదు సెంటర్లోని గద్దెపై సర్పంచ్ జాతీయజెండాను ఎగురవేస్తారు. ఈ ఏడాది సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గార్ల మేజర్ గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ మంగమ్మ నేడు జాతీయజెండా ఆవిష్కరిస్తారని పంచాయతీ కార్యదర్శి కిషన్ వెల్లడించారు.

